క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో కొత్తమ్మ తల్లి



తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంత పేట, కొత్తపేట గ్రామదేవత కొత్తమ్మ తల్లిని మంగళవారం గులాబీలు, సన్నజాజులు, బంతి పువ్వులు, వేప కొమ్మలతో భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మతల్లి ఆలయం, భవాని పీఠానికి చెందిన సాడి కుమార్, వెంపాడ రామిరెడ్డి అలంకరించారు. ఈ అలంకరణకు భీమిలి మండలం తాళ్లవలసకు చెందిన కె.సోమేశ్వరరావు సహకారం అందించారు.

రామావతారంలో జగన్నాథుడు



భీమునిపట్నం: జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ఆర్.సింగరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి అవతార విశిష్టతను వివరించారు.

మెషీన్ లెర్నింగ్‌పై ఎఫ్‌డీపీ

కొమ్మాది: మెషీన్ లెర్నింగ్‌పై అధ్యాపకులు, పరిశోధకులకు అవగాహన కల్పించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజులు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) మంగళవారం ప్రారంభమైంది. ఐఐటీ గౌహతితో కలిసి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల అధ్యాపకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రొఫెసర్ డా. త్రివేది మాట్లాడుతూ వీఎల్ఎస్ఐ, కంప్యూటర్ రంగాల్లో మెషీన్ లెర్నింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతను వివరించారు.

బీజేపీ బలోపేతానికి ప్రణాళికలు

మధురవాడ: భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఆ పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ జనరల్ సెక్రటరీ ఎస్‌వీఎస్ దిలీప్ వర్మ చెప్పారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ కార్వేలి నగర్‌లో పార్టీ బూత్, మండల, వార్డు నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం 'మేరా బూత్ సబ్ సే మజ్బూత్' కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ఉన్న బూత్ కమిటీలను ఉద్దేశించి బోపాల్ నుంచి ఇచ్చిన సందేశం వీక్షించారు. కార్యక్రమంలో దేవర సురేంద్ర కుమార్, బంగారు అనీల్ కుమార్, చోడవరపు నాగరాజు, జీఆర్ఎస్ఎన్ రాజు, ఎం.రాంబాబు, షణ్ముఖరావు, ఎన్.సునీత తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దుర్గానగర్‌లో చెత్త పేరుకుపోవడంతో 'దుర్గానగర్‌లో క్షీణించిన పారిశుధ్యం' శీర్షికతో సాక్షి పత్రికలో మంగళవారం ప్రచురించిన వార్తకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి స్పందించారు. దుర్గానగర్, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీల్లో వ్యర్థాలను సిబ్బందితో తొలగించారు.

సీపీఎం విరాళాల సేకరణ

పద్మనాభం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు చేపట్టిన పాదయాత్రకు సంఘీభావంగా సీపీఎం కార్యకర్తలు కృష్ణాపురం ఎస్సీ కాలనీ, పద్మనాభంలో మంగళవారం విరాళాలు సేకరించారు. సీపీఎం నాయకులు ఆర్.నరిసింగరావు, పి.ఆదినారాయణ, ఎం.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో మహిళలే మహారాణులు

- టీడీపీ హయాంలో సంక్షేమ పథకాల ఊసే లేదు
- సీఎం జగన్‌నే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటాం
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో నినదించిన మూలకుద్దు గ్రామస్తులు



కొత్త మూలకుద్దులో మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నన్ని సంక్షేమ పథకాలు టీడీపీ హయాంలో ఎన్నడూ రాలేదని భీమిలి మండలం కొత్త మూలకుద్దు గ్రామస్తులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో చెప్పారు. మంగళవారం సాయంత్రం మూలకుద్దులో 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా మహిళలు ఎమ్మెల్యేతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలే మహారాణులు అన్న విషయం నిరూపితమైందన్నారు. కడుపులో చల్ల కదలకుండా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుంటామని ముక్తకంఠంతో హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ నాలుగేళ్లలో కొల్లి నరసయ్యమ్మకు రూ.5.76 లక్షలు, కొల్లి లక్ష్మికి రూ.5.39 లక్షలు, కర్ణపు నరసయ్యమ్మకు రూ.5.32 లక్షలు, కొల్లి నరసయ్యమ్మకు రూ.5.66 లక్షలు, ఎరుసు అప్పలరెడ్డికి రూ.5.07 లక్షలు, ఎరుసు జగదీష్‌కు రూ.5.02 లక్షలు, కొల్లి అన్నపూర్ణకు రూ.4.71 లక్షలు ప్రభుత్వం నుంచి అందాయని వెల్లడించారు. వారంతా రావాలి జగన్ – కావాలి జగన్ అంటూ కీర్తించారు.

సీఎం జగన్‌ది పెద్ద మనసు

చంద్రబాబుకు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా అవకాశం వచ్చినా ప్రజలకు ఏమీ చేయడానికి మనసు అంగీకరించలేదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సీఎం జగన్ ఇప్పటికే మూడు సార్లు సున్నా వడ్డీ, రుణమాఫీ అందించి పెద్ద మనసు చాటుకున్నారన్నారు. నాలుగో విడత కూడా పంపిణీ చేసే ఎన్నికలకు వెళ్తారని పేర్కొన్నారు. అప్పుడు కూడా మహిళలు సీఎం జగన్‌పై ఇదే అభిమానం చూపించాలని కోరారు.

ఈ సందర్భంగా పంచాయతీ మహిళలు డ్రైనేజీలు, ఇంటింటికీ కుళాయిలు, టీడీపీ హయాంలో మంజూరైనా ఇళ్లు రాని బాధితులు, మాజీ సైనికులకు రైస్ కార్డులు, ప్రస్తుతం రెండో లిస్టులో ఇళ్ల స్థలాల కేటాయింపు, తదితర సమస్యలను వివరించగా జగనన్న సురక్ష, సచివాలయాల ద్వారా పరిష్కారానికి చర్యలు చేపట్టాలని భీమిలి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, ఎంపీడీవో పి.వెంకటరమణకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సలహా మండలి జిల్లా చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, విశ్రాంత వీఆర్వో కొయ్య అప్పల సూర్యనారాయణరెడ్డి, కొల్లి కోటిరెడ్డి, దుంపల ప్రభాకర్, కొయ్య గురయ్యరెడ్డి, భాగం సుధాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమ్మిడి శ్రీనివాసరావు, జీవీ నారాయణ, వెంపాడ సూరిబాబు, బొడ్డు దుర్గారావు, ఉండబట్ల చిన్నారావు, మద్దిల వెంకటరమణ, శిల్లా వంశీరెడ్డి, కొయ్య రమేష్‌రెడ్డి, తుపాకుల అప్పలరాజు, పల్లా సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సీ ఫుడ్స్ కంపెనీల కలుషిత నీటితో కాలుష్యం



నురగలు కక్కుతున్న కలుషిత నీరు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో గెడ్డ నీరు కలుషితమవుతోందని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారికవలస, కొమ్మాదిలో గల కొన్ని సీ ఫుడ్స్ కంపెనీలు కలుషిత నీరును నేరుగా వదిలేయడంతో మారికవలస నుంచి కాపులుప్పాడ గెడ్డలోకి కలిసిపోతుంది. దీంతో నీరు కలుషితమవ్వడమే కాకుండా దుర్వాసన వస్తోంది. మంగళవారం ఈ గెడ్డ వద్ద భారీ ఎత్తులో కలుషిత నీరు నురగలు కక్కుతున్న దృశ్యమే ఇందుకు సాక్ష్యం. ఇదే కలుషిత నీరు సమీపంలోని పంట పొలాలతోపాటు నగరపాలెం నుంచి ప్రవహించే గెడ్డలో కలిసిపోయి నేరుగా సముద్రంలోకి చేరడంతో సముద్ర జలాలు కూడా కలుషితమవుతున్నాయి. మరోవైపు కలుషిత నీరు నేరుగా గెడ్డ నుంచి సముద్రంలోకి కలవడంతో సముద్ర జీవరాశులు, చేపలు, తాబేళ్లు వంటివి మృత్యువాత పడి తీరానికి కొట్టుకొస్తున్నాయి. ఈ కలుషిత నీటి ప్రభావం ఉప్పాడ నుంచి తిమ్మాపురం బీచ్ వరకు ఉంటుందని స్థానికులు, మత్స్యకారులు అంటున్నారు. అధికారులు స్పందించి సీ ఫుడ్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రీడా పోటీలకు అనిట్స్ విద్యార్థులు



విద్యార్థులతో అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాల సీఈవో నిరంజన్‌కుమార్

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ వైద్య విద్యార్థులు దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలో జరుగుతున్న క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సీఈవో నిరంజన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ నగేష్ అభినందించారు. వీరిలో బెంగుళూర్ జైన్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే టెన్నిస్ పోటీలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వైద్య విశ్వవిద్యాలయం తరపున రెండో సంవత్సరం వైద్య విద్యార్థులు బెహరా లక్ష్మి సాయి రితిక, బి.ఎల్.ఎస్.కీర్తన పాల్గొన్నారు. అలాగే పంజాబ్ రాష్ట్రం అమృతసర్‌లో జరుగుతున్న ఆల్ ఇండియా తైక్వాండో పోటీలకు మొదటి సంవత్సరం విద్యార్థి రజక ప్రసన్న, నాలుగో సంవత్సరం విద్యార్థి ఎల్‌టీ భువనేశ్వరి పాల్గొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఆల్ ఇండియా అంతర విశ్వవిద్యాలయాల రోలర్ హాకీ పోటీల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు దాసరి సాయిదత్త, కె.ఎస్.ఎస్.ఆదిత్య పాల్గొన్నారు. డాక్టర్ వైఎస్సార్ విశ్వవిద్యాలయం పరిధిలో జరగనున్న సౌత్‌జోన్ కబడ్డీ పోటీల్లో ఎమ్ఎల్‌టీ మొదటి సంవత్సరం విద్యార్థి పోతిన సత్యశేషారావు పాల్గొన్నారని తెలిపారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి సహకరించాలి

ఆనందపురం : మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల యువత జీవితాలు అంధకారమయం అవుతున్నాయని ఆనందపురం సీఐ రామచంద్రరావు అన్నారు. ఆనందపురం జంక్షన్‌లో మంగళవారం సిటీ పోలీస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామచంద్రరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ప్రభావం తీసుకున్న వారి జీవితంతోపాటు కుటుంబ సభ్యులపైన ఉంటుందని చెప్పారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించడం వల్ల ఆరోగ్యం పూర్తిగా క్షీణించి అర్ధాంతరంగా తనువు చాలించాల్సి వస్తుందని వివరించారు. మత్తు పదార్థాలు విక్రయించే ప్రాంతాలు, వ్యక్తుల సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా సచివాలయ పోలీసులతో ర్యాలీ నిర్వహించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



అన్నదానం ప్రారంభిస్తున్న స్థానిక నాయకులు

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు శ్రీ దుర్గాలమ్మ, ఎల్లమ్మ, నాగులమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా స్థానిక మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం మధ్యాహ్నం మహా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గుంటుబోయిన సంజీవ్ యాదవ్, తలసీల విజయ మోహన్‌రావు, కాలనీ ప్రెసిడెంట్ అవతార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు అమ్మవార్ల సన్నిధిలో ఏయూ వీసీ



ఏయూ వీసీ ప్రసాదరెడ్డితో వైఎస్సార్‌సీపీ నాయకులు, రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

తగరపువలస: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి పీవీజీడీ ప్రసాదరెడ్డి మంగళవారం సంగివలసలోని ముగ్గురు అమ్మవార్లు పోలమాంబ, ముత్యమాంబ, మరిడిమాంబను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి ఆహ్వానం మేరకు ఇక్కడకు వచ్చిన వీసీ ప్రసాదరెడ్డి సబ్బివానిపేటలో ఆయన ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా బాణసంచాతో రెడ్డి సంక్షేమ సంఘ ప్రతినిధులు, జీవీఎంసీ రెండో వార్డు నాయకులు వీసీకి సాదరంగా స్వాగతం పలికారు. రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మారం బాలబ్రహ్మరెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ రౌతు భాస్కరరెడ్డి, ఇరిగేషన్ ఏఈ తార ధర్మేంద్రరెడ్డి, నీలాపు సన్యాసమ్మ, మద్ది మహాలక్ష్మి, జీవీఎంసీ రెండో వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, చిప్పాడ వెంకటేష్, బింగి కిరణ్ రెడ్డి, డబ్బీరు ప్రశాంతి, తెడ్లాపు అప్పలరాజు, సరగడ నాగిరెడ్డి, నీలాపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్‌లో వరుసగా చోరీలు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు శ్రీనగర్ మసీదు వీధిలో చీకటిపడితే వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఖరీదైన ద్విచక్ర వాహనాల హేండ్ లాక్‌లను కాలితో వంచి దర్జాగా పట్టుకుపోవడం సీసీ కెమెరాలలో నమోదయింది. బంగ్లామెట్టలో కూడా ఇటీవల మాస్కులు ధరించి ద్విచక్ర వాహనాలు పట్టుకుపోయిన సంఘటనలు సీసీ కెమెరాలలో కనిపించాయి. దీంతో ఈ ప్రాంతాల్లో పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

30న శాకాంబరీ ఉత్సవాలు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టుపై కొలువైన శ్రీ పంచముఖ ఆంజనేయ, షిర్డీ సాయినాథ సహిత దుర్గాలమ్మ ఆలయంలో 30న శాకాంబరీ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు, ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. 29న రాత్రి అమ్మవారికి పంచామృత సుగంధ జలాభిషేకాలు జరిపించి, ప్రత్యేక అలంకరణ అనంతరం కూరగాయలు, పండ్లు, ఫలాలతో అలంకరణ చేస్తారన్నారు. 30న ఉదయం భక్తులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

పద్మనాభం: పద్మనాభం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ రెడ్డిపల్లి ఫీడర్‌కు మరమ్మతులు చేపట్టనున్నందున ఈ పీడర్ పరిధిలోని గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డిపల్లి, శేరిఖండం, పొట్నూరు, నరసాపురం, తునివలస, విజయానందపురం, భద్రయ్యపేట, సుంకరపేట, నరసాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

వలందపేటలో తాగునీటి సమస్య

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు వలందపేటలో తాగునీటి సమస్య కారణంగా మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా సక్రమంగా ఉండకపోవడంతో ఒక్కో కుటుంబానికి రెండు బిందెలు అయినా తాగునీరు సరఫరా కావడం లేదని అంటున్నారు. బోరు బావులు కూడా పనిచేయనందున కుళాయిల ద్వారా నీటి సరఫరా సమయాన్ని పెంచి... అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని వలందపేటకు చెందిన ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తగరపువలస: భీమిలి మండలం అమనాం పంచాయతీకి చెందిన గొరుసు సత్యవతి (32) అనే మహిళ మంగళవారం రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ సంగివలస అనిల్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో మృతి చెందింది. సత్యవతి తగరపువలసలో నివసిస్తూ పాల వ్యాపారం చేస్తుండగా భర్త అప్పలరెడ్డి ముఠా పనులు నిర్వహిస్తూ ఉంటాడు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. అమనాం సచివాలయానికి సత్యవతి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా విజయనగరం జిల్లా డెంకాడ మండలం లింగాలవలస వద్ద ప్రమాదానికి గురయింది. దీంతో వెనుక నుంచి భారీ వాహనం ఈమె నడుము పైనుంచి వెళ్లిపోగా తీవ్ర గాయాల పాలయింది. స్థానికులు ఆమెను చికిత్స కోసం సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. పోస్టుమార్టం నిమిత్తం ఆమె మృతదేహాన్ని సుందరపేట పీహెచ్‌సీకి తరలించారు. డెంకాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రచారం



అంబేడ్కర్ కూడలిలో ప్రచారం చేస్తున్న నాయకులు

తగరపువలస: పీఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోని మారుపేరు కార్మికులు సహా అందరూ జూలై 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని చిట్టివలస జ్యూట్‌మిల్లు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం అంబేడ్కర్ కూడలి వద్ద కరపత్రాలు, మైక్‌తో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల మిగులు బకాయిల విషయాన్ని ఇటీవల భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ మేరకు మిల్లు యాజమాన్య ప్రతినిధి లలిత్‌మోహన్‌కు కూడా ఫోన్ చేసి ఆగస్టు 15లోగా బకాయిలు చెల్లించాలని హెచ్చరించినట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారి కోసం మిల్లు లేబర్ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు అందుబాటులో ఉంటామన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో నాయకులు అల్లు బాబూరావు, దల్లి అప్పలరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, గొండేల అప్పారావు, కొల్లి రెడ్డి, కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రంపాలెం హైస్కూల్ హెచ్ఎం రాజబాబు



మాట్లాడుతున్న ఎంఈవో - 2 బాబూలాల్

మధురవాడ: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందుతోందని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎమ్.రాజబాబు చెప్పారు. మంగళవారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో రాజబాబు, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బి.మీనా మాట్లాడారు. పాఠశాల ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశామన్నారు.

ప్రస్తుతం రోజూ పిల్లలకు రాగిజావ, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. సుమారు రెండున్నర కోట్ల రూపాయలతో అదనపు తరగతి గదుల నిర్మాణం, తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పిళ్లా.సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపించాలి

పద్మనాభం: తల్లిదండ్రులు తమ పిల్లలను మాన్పించకుండా బడికి పంపించాలని ఎంఈవో – 2 బాబూలాల్ కోరారు. మండలంలోని పలు ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు నిర్వహించారు. రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం మౌలిక సౌకర్యాలు కల్పించిందన్నారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారన్నారు. ఇప్పటికే జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశామన్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. సమావేశంలో హెచ్ఎం వి.శంకరరావు, ఎంపీటీసీ సభ్యుడు, సీర సూరప్పుడు పాల్గొన్నారు.

తెలుగు, సోషల్ ఉపాధ్యాయులను నియమించండి

తగరపువలస: సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్‌లో తెలుగు, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ ప్రధానోపాధ్యాయుడు వై.జగన్నాథ స్వామికి విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం వినతిపత్రం అందించారు. కొంతకాలంగా హైస్కూల్‌లో ఈ రెండు సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేనందున విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మాజీ కౌన్సిలర్ జీవీ రమణ మాట్లాడుతూ ప్రత్యామ్నాయంగా మిగిలిన ఉపాధ్యాయులతో ఈ రెండు సబ్జెక్టులు బోధించినా ఉపాధ్యాయుల కొరత కనిపిస్తుందన్నారు. తక్షణమే విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ రెండు సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

'పథకాలు అందని వారిని గుర్తించాలి'



వాంబేకాలనీలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కొండలరావు

మధురవాడ: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయో..? లేదో..? తెలుసుకోవాలని ఎమ్ఎల్‌వో సీహెచ్.కొండలరావు సూచించారు. జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని సచివాలయాల్లో సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులతో జగనన్న సురక్ష నిర్వహణపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో జూలై 5న అన్ని విభాగాల అధికారులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, సచివాలయాల కన్వీనర్ కుడితి రామారావు, సచివాలయాల సిబ్బంది టి.వరలక్ష్మి, పి.ఎల్లాజీ, ఎమ్.పోలిరాజు, కె.మంగ, నారాయణరావు, నాగరత్నం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై ప్రచారం

భీమునిపట్నం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంపై వైఎస్సార్ సీపీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో ఎగువపేట ప్రాంతంలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైనా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే సమస్య పరిష్కరించి అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సమస్యలున్న వారి వివరాలు సచివాలయ సిబ్బంది నమోదు చేసుకున్నారు. వాసుపల్లి కొండబాబు, సచివాలయ అడ్మిన్ బీసీ నాయుడు, వీఆర్‌వో రత్నకుమారి పాల్గొన్నారు.

అల్లం అప్పారావు విగ్రహం ఏర్పాటుకు అభ్యర్థన

తగరపువలస: జేఎన్‌టీయూ (కాకినాడ) ఉప కులపతిగా పనిచేసిన ప్రొఫెసర్ అల్లం అప్పారావు కాంస్య విగ్రహాన్ని అదే విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభ్యర్థిస్తూ భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం వినతిపత్రం పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్‌గా, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాష్ట్రంలో విద్యారంగానికి విశేష కృషి చేసిన ఆయన సేవలు అందరూ గుర్తించుకోవాలన్నారు. సమాజ సేవ కోసం పనిచేసేవారు అరుదుగా ఉంటారని, అలాంటి వ్యక్తి మరణం తీరనిలోటన్నారు. స్ఫూర్తి నింపే ఆయన విగ్రహం ఏర్పాటు ఆవశ్యకమన్నారు. దీనిపై సీఎం జగన్ సానుకూలంగా స్పందిస్తారని ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

శ్రీనివాసరెడ్డికి ఇన్‌ఫ్లుయెన్సర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు



జైపూర్‌లో అవార్డు తీసుకుంటున్న వెంపాడ శ్రీనివాసరెడ్డి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్టకు చెందిన సామాజిక సేవా కార్యకర్త వెంపాడ శ్రీనివాసరెడ్డికి రాజస్థాన్‌కు చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. ఏళ్ల తరబడి వుయ్ కేర్ యూ సొసైటీ, వెంపాడ ఫౌండేషన్, హెల్పింగ్ హేండ్స్ తదితర ప్లాట్‌ఫారాల ద్వారా అందిస్తున్న సేవలకు ఈ గుర్తింపు లభించింది. ఈ మేరకు మంగళవారం జైపూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఇన్‌ఫ్లుయెన్సర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ చీఫ్ ఎడిటర్లు జయాష్ బట్, మహిమా జైన్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. దేశంలోని వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి నిర్వాహకులు ఈ పురస్కారాలు అందిస్తారని శ్రీనివాసరెడ్డి తెలిపారు.

శ్మశానవాటికలో పూడికపై బ్లీచింగ్

సాక్షి ఎఫెక్ట్..



పనులు పర్యవేక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: చిల్లపేట శ్మశానవాటికలో డంపింగ్ చేసిన పూడికలో మంగళవారం శానిటేషన్ కార్యదర్శులు బ్లీచింగ్ చల్లారు. చిట్టివలస – చిల్లపేట చెరువును ఆనుకుని డ్రైనేజీల్లో తొలగించిన పూడికను లారీలతో తరలించి శ్మశానవాటికలో డంప్ చేయడంతో విపరీతమైన దుర్వాసన కారణంగా దగ్గరలో ఉన్న భీమిలి కేథరిన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రెండు రోజులపాటు ఇబ్బందులు పడ్డారు. దీనిపై 'డ్రైనేజీల పూడిక డంపింగ్‌తో దుర్వాసన' శీర్షికతో మంగళవారం సాక్షిలో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించి బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి మాట్లాడుతూ శ్మశానవాటికలో పూడిక వేసిన ప్రదేశంలో మట్టి తర్వాత గ్రావెల్‌తో చదును చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.